# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక విశ్వవిద్యాలయం ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- ❖ ఉద్యాన వన పంటల సాగుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయవాడలోని ఈరోజు సాయంత్రం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలను ప్రారంభించారు.
- ❖ ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

=========================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈ రోజు ఉదయం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో విశ్వవిద్యాలయాల ఏర్పాటుపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక విశ్వవిద్యాలయం ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. అమరావతి లో బిట్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం 70 ఎకరాలను కేటాయిస్తూ.. ఇటీవల కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. డీప్ టెక్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారని నారా లోకేష్ మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

=========================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 18వ రోజుకు చేరుకున్నాయి. ఉభయ సభలు ఈరోజు ఉదయం ప్రశ్నోత్తరాలతో ప్రారంభమయ్యాయి. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఉదయం ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. అందులో భాగంగా జలవనరుల శాఖ

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వాగులు, కాల్వల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. బుడమేరు ఆక్రమణలు అరికట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామని మంత్రి తెలిపారు.

==========================

అసెంబ్లీ సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సాయంత్రం ఢిల్లీకి బయలుదేరారు. రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్‌తో చంద్రబాబు నాయుడు రేపు సమావేశం కానున్నారు.

==========================

రాష్ట్రంలో రాయితీతో కూడిన డ్రిప్, స్ప్రింకర్ల పథకాన్ని తిరిగి పునరుద్ధరించనున్నామని వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో శాసనమండలి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు జిల్లాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేశామని చెప్పారు. 2025-26 సంవత్సరానికి గానూ ఎస్సి, ఎస్టి రైతులకు నూరు శాతం రాయితీ ఇస్తున్నామని తెలిపారు. క్లస్టర్లు రైతుల పంట సాగు అభివృద్ధికి దోహద పడతాయని అన్నారు . ఉద్యాన పంటలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల అనంతరం ఈరోజు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ్యులు, మండలి సభ్యులకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణం రాజు ప్రారంభించారు. క్రీడాపోటీల్లో రాష్ట్రమంత్రులు నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, మండలిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి సహా ఇతర శాసనసభ్యులు పాల్గొంటున్నారు.

==========================

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న కారణంగా ఈరోజు నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే ప్రీ స్కూల్ నిర్వహించాలని అలాగే మధ్యాహ్న భోజనం ఖచ్చితంగా అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

విరామం

==========================

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ రోజు శాసనమండలిలో సభ్యుడు అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... ఒంటిమిట్ట ఆలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటకం పరిధిలోకి తీసుకువచ్చే ప్రతిపాదన వుందని, ఈ మేరకు దేవాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవాలయం చుట్టు ప్రక్కల ఉన్న ఆలయాలను కలుపుతూ.. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారుస్తామని తెలిపారు. ప్రస్తుతం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఉందని వెల్లడించారు. ఇటీవల తీసుకొచ్చిన టెంపుల్ టూరిజం పాలసీ ద్వారా ఆలయాల అభివృద్ధికి అడుగులు వేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడాతూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉపాధి కల్పన, పి ఎం. విశ్వకర్మ యోజన పథకాలు జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె. విజయరత్నం చెప్పారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు 50 లక్షల రూపాయల నుండి  కోటి రూపాయలు వరకు రుణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. యువత ఇటువంటి పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

==========================

భవనాల నిర్మాణంలో ఇబ్బందులను తొలగించేందుకే మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీస్ సవరణ బిల్లు – 2025 బిల్లును తీసుకొచ్చామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారయణ తెలిపారు. ఈ రోజు శాసనభలో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం 21 అర్భన్ డెవలప్ మెంట్ అథారిటీలున్నాయన్నారు. మొత్తం 83 శాతం జనాభా ఈ అర్బన్ అథారిటీల పరిధిలోనే ఉందని పేర్కొన్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ బిల్లు గురించి అధ్యయనం చేసిన అనంతరం సభలో ప్రవేశపెట్టామన్నారు. పట్టణ స్థానిక సంస్థలకు భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల అధికారం కల్పించామని చెప్పారు. భవనాల నిర్మాణంలో ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థలకు అధికారాలు ఇస్తూ... ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జూన్ నెలకి సంబంధించి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన  కోటాను ఈ రోజు విడుదల చేసింది. ఈ సేవల ఎలక్ట్రానిక్ లక్కీడిప్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్జిత సేవా టికెట్లను విడుదల చేస్తామని టీటీడీ వెల్లడించింది. 22వ తేదీ ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటాను.. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపింది. అలాగే 24వ తేదీ ఉదయం 10 గంటలకు 300 రూపాయల టికెట్ల కోటాను విడుదల చేస్తామని టీటీడీ ప్రకటించింది.

==========================
==========================